వీసీ నియామకం అభినందనీయం

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి (వీసీ)గా బలహీన వర్గాలకు చెందిన ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యను నియమించడం అభినందనీయమని బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భిక్షపతి, ప్రధాన కార్యదర్శి దశరథ్ అన్నారు. ముఖ్యమంత్రి రెవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు ఈ సందర్భంగా వారు ధన్యవాదాలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బలహీనవర్గాల ప్రభుత్వమని మరో సారి రూజువు అయిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు రమేష్, కృష్ణ, కవిత, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తాం


మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో కొన్ని కాలనీలలో సమస్యలు ఉన్నాయని, వాటిని నిధులు లభ్యతను బట్టి త్వరలోనే పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ అవినాష్, ప్రధాన కార్యదర్శి వి.అంజనేయులు ఆధ్వర్యంలో పలు కాలనీల నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా కాలనీలలో పార్కులు, కమ్యూనిటీ హాల్‌లు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల ఏర్పాటు గురించి ఆయనతో చర్చించారు. ఆయ పనులన్నింటినీ త్వరలోనే పూర్తి చేస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. కోశాధికారి బాబురావు, పలు కాలనీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభితం


ఇంద్రయజ్ఞం చేస్తున్న నిర్వాహకులు

అత్తాపూర్: హైదరాబాద్ చిన్న అనంతగిరి శివాలయంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ముఖ్య అతిథులుగా అడిషనల్ డీసీపీ శ్రీనివాస్‌రావు, చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ విద్యాసాగర్ రెడ్డి, విశిష్ట అతిథులుగా రాష్ట్రీయ సేవికా సమితి గౌడ రమాదేవి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ రమా విశ్వనాథ్ విచ్చేశారు. కార్యక్రమాన్ని గాయత్రీ తపోవనం ఆశ్రమ శిష్యులు అందరూ కలిసి మూలకర్తలుగా నిలిచి నిర్వహించారు. కుల వర్ణ ప్రాంత వివక్ష లేకుండా ప్రజలంతా ఇంటిదగ్గర సరళమైన రీతిలో యజ్ఞం చేసుకునే విధానాన్ని తెలియజేస్తూ రూపొందించిన ఇంద్ర యజ్ఞం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అరుణాచలం పుణ్యక్షేత్రంలో భగవాన్ రమణ మహర్షి, కావ్య కంఠ గణపతి ముని ఆశీస్సులతో... వేదాలలో వివరించిన మంత్రాల ఆధారంగా ఈ పుస్తకం రూపొందించారు. ఇందులో సరళంగా యజ్ఞం చేసుకునే విధానాలు, మంత్ర భావాలతో సహా శ్రీ గణపతి ముని ప్రసాదించిన ఇంద్ర యజ్ఞంను వివరించినట్లు గ్రంథకర్త సూర్య ఫణిమాధవ్ వెల్లడించారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన భక్తులందరితో కుల ప్రాంత వర్ణ, లింగ విచక్షణ లేకుండా సామూహికంగా ఇంద్రయజ్ఞం చేయించారు. ఇదే మాదిరిగా సరళమైన రీతిలో ప్రతి ఇంట్లోనూ ఇంద్ర యజ్ఞం జరగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

ఐసీఎం ఆవరణలో 'స్వచ్ఛత పరిరక్షణ సేవ'


పరిసరాలను శుభ్రం చేస్తున్న అధికారులు

రాజేంద్రనగర్: కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వ పర్యవేక్షణలో పని చేస్తున్న సహకార నిర్వహణ సంస్థ (ఐసీఎం) ఆవరణలో శుక్రవారం స్వచ్ఛత పరిరక్షణ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు చీపుర్లను పట్టుకొని పరిసరాలను శుభ్రం చేసి చెత్త చెదారాలను తొలగించారు. కార్యక్రమంలో డాక్టర్ గణేశన్, డాక్టర్ శ్రీనివాస్, సురేశ్, సీనియర్ ఫ్యాకల్టీస్, సిబ్బంది పాల్గొన్నారు. స్వచ్ఛత పరిరక్షణ సేవలో నిరంతరం పాల్గొంటామని సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

రాములు మృతి తీరనిలోటు: ఎమ్మెల్యే


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రజా టైమ్స్ పత్రిక ఎడిటర్ రాములు మృతదేహానికి శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డితో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, జర్నలిస్టులు నివాళులర్పించారు. పోస్టుమార్టం అనంతరం రాములు మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఎర్రబోడలోని నివాసానికి తరలించారు. సాయంత్రం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. శనివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రాథమిక స్థాయిలోనే అక్రమ నిర్మాణాలను నియంత్రించాలి

గచ్చిబౌలి: అక్రమ నిర్మాణాలను ప్రాథమిక స్థాయిలోనే నియంత్రించాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జోనల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగంపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించరాదని, అధికారులు ఎటువంటి తప్పిదాలు చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. టీఎస్‌బీపాస్ ద్వారా నిర్మాణ అనుమతులను సద్వినియోగం చేసుకునేలా నిర్మాణదారులకు అవగాహన కల్పించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే అనుమతులకు నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆఫీస్‌లో కూర్చుని అనుతుమలు జారీ చేసే విధానానికి స్వస్తి పలకాలని తెలిపారు. కోర్టు కేసులలో సకాలంలో కౌంటర్లు దాఖలు చేసి జాప్యం లేకుండా చూడాలని సూచించారు. రహదారి విస్తరణను ప్రాధాన్యత తీసుకొని ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం చూపించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.

సమస్యలు పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలి

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


నార్సింగిలో సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: మున్సిపాలిటీలలో సమస్యలను పరిష్కరించి వారి మన్ననలు పొందేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 4, 5, 6, 7, 16, 17, 18 వార్డుల్లో రూ. 8.10 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్, శ్మశానవాటికలో స్నానాల గదులు, మున్సిపల్ కార్యాలయంలో అదనపు అంతస్తును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మున్సిపాలిటీలలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా సమస్యలూ అదే స్థాయిలో పెరుగుతున్నాయన్నారు. ఆయా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి మన వద్దకు ప్రజలు వచ్చి స్థిరపడుతున్నారని, వారికి అన్ని రకాల సౌకర్యాలను కల్పించి మన్ననలు పొందాలన్నారు. నిధుల లభ్యతను బట్టి రాబోయే రోజుల్లో మిగిలి పోయిన పనులను పూర్తి చేయాలన్నారు. నార్సింగి నుంచి శంకర్‌పల్లి వరకు ఉన్న నాలుగు లైన్ల రోడ్డును ఆరు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు రూ. 20 కోట్ల నిధులను కేటాయించాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డిని కోరానన్నారు. త్వరలోనే పనులు మొదలవుతాయని తెలిపారు. రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి, డీఈ నరేష్‌కుమార్, ఏఈ శ్రీనివాస్, కౌన్సిలర్‌లు దుర్గేష్ యాదవ్, శివారెడ్డి, పత్తి శ్రీకాంత్, జి.అరుణ జ్యోతి, కె.లక్ష్మీప్రవళిక కిరణ్, జి.అమరేందర్‌రెడ్డి, జి.వెంకటేష్‌యాదవ్, కె.ఉషారాణి, కె.నరేష్ పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు చర్యలు చేపట్టండి


ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న గేటెడ్ కమ్యూనిటీవాసులు

మణికొండ: ఎలాంటి అనుమతులు లేకుండా తమ గేటెడ్ కమ్యూనిటీల పక్కనే రెడీ మిక్స్ ప్లాంట్లను కొనసాగిస్తూ వాయు, శబ్ద కాలుష్యానికి కారణం అవుతున్న వారిపై చట్టరీత్యా చర్య తీసుకుని వాటిని మూయించి కాలుష్యాన్ని నివారించేలా చూడాలని గేటెడ్ కమ్యూనిటీ నివాసితులు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను కోరారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల సరిహద్దులో ఉన్న మైహోం అవతార్, హాల్ మార్క్ విసినియా గేటెడ్ కమ్యూనిటీలలో 12 వేల మంది నివసిస్తున్నారు. వాటి పక్కనే ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు రెడీమిక్స్ ప్లాంట్లను కొన్ని నిర్మాణ సంస్థలు కొనసాగి స్తున్నాయన్నారు. దాంతో తమకు రాత్రి, పగలు తేడా లేకుండా దుమ్ము, ధూళి, శబ్దాలతో అనారోగ్యాలకు గురవుతున్నామన్నారు. వాటిని వెంటనే మూసివేయించాలని శుక్రవారం ఎమ్మెల్యేను కోరారు. దాంతో పాటు తమ గేటెడ్ కమ్యూనిటీల ముందు రెడీమిక్స్ వాహనాలు తిరిగి రోడ్డు పూర్తిగా పాడయిపోయిందని, దాన్ని బాగు చేయించాలని కోరారు. మైహోం సర్కిల్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ లేకపోవటంతో పలు ప్రమాదాలు జరిగాయని, వెంటనే ఏర్పాటు చేయించాలన్నారు. ముష్కి చెరువులోకి మురుగునీటిని కలుపుతుండటంతో కలుషితం అవుతుందన్నారు. దాన్ని అడ్డుకోవాలని కోరారు. గేటెడ్ కమ్యూనిటీ నివాసితులతో పాటు మణికొండ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి, నార్సింగి కౌన్సిలర్ వెంకటేష్‌యాదవ్, నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బండ్లగూడ'ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

మేయర్ లతాప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి


కమ్యూనిటీ హాల్‌పై అంతస్తును ప్రారంభిస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని మేయర్ లతాప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి అన్నారు. 17వ డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్ కాలనీలో నిర్మించిన కమ్యూనిటీ హాల్ పై అంతస్తును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మొత్తం రూ. 23 లక్షల వ్యయంతో అధునాతన పద్ధతిలో అభివృద్ధి చేశామని తెలిపారు. కమ్యూనిటీ హాల్‌ను స్థానికులు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. మెరుగైన సదుపాయాలను కల్పించేందుకు తమవంతు బాధ్యత వహిస్తామన్నారు. కాలనీ అధ్యక్షుడు చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి విజయఠాకూర్, కె.వి.ప్రసాద్, అనిల్, అత్తర్ అలీ, తిరుమల్లేష్, జ్యోతి పాల్గొన్నారు.

'కల్లు కాంపౌండ్' చూసిన సినిమా తారాగణం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లిలోని ఏషియన్ థియేటర్‌లో శుక్రవారం విడుదలైన కల్లు కంపౌండ్ సినిమాను తారాగణం వీక్షించింది. హీరో డీఎస్ గణేష్, హీరోయిన్ ఆయేషా పటేల్, సినిమా డైరెక్టర్ ప్రవీణ్ జట్టి, ప్రొడ్యూసర్లు బుర్ర మల్లేష్ గౌడ్, హారికా జెట్టి, పిట్టల విజయలక్ష్మీతో పాటు సినిమాలో నటించిన నటీనటులు ప్రేక్షకులతో కలిసి థియేటర్‌లో వీక్షించారు. సినిమా చూసిన అనంతరం ప్రేక్షకులతో హీరోతో పాటు తారాగణం కలిసి ఫొటలకు ఫోజులిచ్చారు. ప్రస్తుత తరుణంలో ఇలాంటి చిన్న బడ్జెట్ సినిమాలు ఎంతో అవసరమని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మంచి సినిమా తీసిన నటీనటులతో పాటు దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

'ది లీగ్'లో బహుముఖ వినోదం


లోగోను ఆవిష్కరించిన భాగస్వాములు

శ్రీ వెంకటేశ్వర గ్రూప్ ఆఫ్ హోటల్స్ భాగస్వామి రాజగోపాల్

మణికొండ: హైదరాబాద్ నగరంలో అత్యుత్తమ వినోద జోన్‌గా ది లీగ్ నిలుస్తుందని, ఇందులో వినోదం, క్రీడలు, విశ్రాంతి, ఆహారం లాంటి బహుముఖ వినోదం ఒకే చోట లభించే స్థలంగా నిలుస్తుందని శ్రీ వెంకటేశ్వర గ్రూప్ ఆఫ్ హోటల్స్ భాగస్వామి ఆర్.వి.రాజగోపాల్ అన్నారు. ఐటీ జోన్ పక్కన పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలో 6.5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన స్పోర్ట్స్, రిక్రియేషనల్ అరెనా అయిన లీగ్‌ను ఆయన శుక్రవారం తోటి భాగస్వాములతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇందులో సాహసోపేతమైన గేమ్‌లు, రుచికరమైన వంటకాలు, సంతృప్తికరమైన పానీయాలు అందుబాటులో ఉంటాయన్నారు. శుభకార్యాలు, కార్పొరేట్ సమావేశాలు నిర్వహించుకోవచ్చన్నారు. ఇందులో 120 సీట్ల స్పోర్ట్స్ బార్, కిచెన్ కలిగిన ది హడల్ బార్ ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ భాగస్వాములు మోనిష్, ఆర్.శ్రీనివాసన్, జనరల్ మేనేజర్ శైలేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ కాన్ఫరెన్స్-2024 సదస్సు ప్రారంభం

రాయదుర్గం: బీమా రంగంలో సైబర్ రిస్క్, మోటార్ పూల్ కార్యకలాపాలకు సంబంధించిన సవాళ్లతో సహా ఉద్భవిస్తున్న ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐఆర్‌డీఏఐ) సభ్యుడు సత్యజిత్‌త్రిపాఠి సూచించారు. నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్సూరెన్స్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్(ఐఐఆర్ఎం) క్యాంపస్ ఆవరణలో ప్రపంచంలో అతిపెద్ద ఇన్సూరెన్స్ సంస్థ స్విస్‌రే సౌజన్యంతో ఐఐఆర్ఎం, తెలంగాణ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో 'ఇన్సూరెన్స్: న్యూ నార్మల్'అనే థీమ్‌తో ప్రతిష్టాత్మకమైన ఇన్సూరెన్స్ కాన్ఫరెన్స్-2024 సదస్సును ఆయన జ్యోతి వెలిగించి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవడంతో పాటు ప్రక్రియలను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. ఐఐఆర్ఎం డైరెక్టర్ అంతనుకుమార్‌దాస్ మాట్లాడుతూ.. బీమారంగంలో 5.0 ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఇన్సూరెన్స్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐబీఏఐ) అధ్యక్షుడు సుమిత్‌బోహ్రా మాట్లాడుతూ.. బీమారంగం పురోగతిపై పలు అంశాలను వివరించారు. స్విస్ రే పి అండ్ సి సొల్యూషన్స్ ఆపరేషన్స్ హెడ్ జితేందర్ బహ్రీ మాట్లాడుతూ.. కస్టమర్‌సెంట్రిసిటీపై దృష్టి సారించి ఇన్సూర్‌టెక్ ఆవిష్కరణలు బీమారంగాన్ని ఎలా మారుస్తాయో వివరించారు. ఐఐఆర్ఎం ప్రిన్సిపల్ డాక్టర్ వివికెమోహన్, బీమారంగ నిపుణులు, ఇన్నోవేటర్లు పాల్గొన్నారు.

ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహిస్తా: కౌసర్



గోల్కొండ: ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహిస్తానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. కార్వాన్ సబ్జిమండిలోని వీరాభిమన్యు వ్యాయామశాలలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రెజ్లింగ్ పోటీలు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్వాన్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన క్రీడాసామగ్రిని అందిస్తామన్నారు. గోల్కొండ, లంగర్‌హౌస్ డివిజన్‌లలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రన్నింగ్, లాంగ్ జంప్, ఇండోర్ క్రీడా అంశాల్లో ఆయా పాఠశాలల అధ్యాపక బృందం ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు. వివిధ రకాల క్యాటగిరిల్లో గుర్రం సురక్షిత్‌కుమార్, 125 కిలోల విభాగంలో ఆయూష్‌సింగ్, 97 కిలోల విభాగంలో ఆయూష్ గుప్తా, 61 కేజీల విభాగంలో సంజయ్ తదితరులు స్వర్ణ పతకాలు సాధించారు.

ట్రాఫిక్ నియంత్రణకు బారికేడ్ల ఏర్పాటు


లిమ్స్ యజమాన్యం ఏర్పాటు చేసిన బారికేడ్ల వద్ద స్థానికులు

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఘాన్సిమియా గూడలో పెరుగుతున్న ట్రాఫిక్ కారణంగా ట్రాఫిక్ నియంత్రణ కోసం లిమ్స్ ఆస్పత్రి యజమాన్యం బారికేడ్లు ఏర్పాటు చేసింది. భారీ వాహనాల రాకపోకల కారణంగా స్థానికంగా ఎదురవుతున్న ఇబ్బందులు, జరుగుతున్న ప్రమాదాలను ఇటీవల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలకమర్రి మహేందర్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు జల్లా ఆనంద్‌లు లిమ్స్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ రామరాజును ఘాన్సిమియా గూడలో బారికేడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. వారి వినతి మేరకు ఆయన బారికేడ్లు ఏర్పాటు చేయడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు రామరాజుకు కృతజ్ఞతలు తెలిపి శాలువాలతో సత్కరించారు. మాజీ ఉప సర్పంచ్ మల్లేష్‌గౌడ్, లీడర్ జంగయ్య, రవీందర్‌గౌడ్, నందం,బాబు, రాజు, శ్రీనివాస్, శ్రీకాంత్, హసీన్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

20న శాంతిసరోవర్‌లో బాల బృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో బాల బృందావనం కార్యక్రమం నిర్వహిస్తారు. ఆదివారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. 'ఫ్లవర్స్ ఆఫ్ గాడ్స్ గార్డెన్'అనే అంశంపై ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో 9 నుంచి 14 ఏళ్లలోపు వారు పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారు. వివరాలకు 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

నేడు కార్వాన్‌లో కిషన్‌రెడ్డి పర్యటన

లంగర్‌హౌస్: నేడు కార్వాన్ నియోజకవర్గంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటించనున్నారని హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, లంగర్‌హౌస్ డివిజన్ అధ్యక్షుడు నాగేంద్రప్రకాష్‌రెడ్డి అన్నారు. మూసీ బాధితులకు భరోసా కల్పించేందుకు శనివారం ఆయన పర్యటించనున్నట్లు లంగర్‌హౌస్‌లో సమావేశంలో తెలిపారు. వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ పునరుజ్జీవనం పేరుతో పేదల ఇళ్లను కూల్చి వారిని రోడ్డున పడేస్తున్నారన్నారు. మూసీ బాధితులతో కలిసి వారికి భరోసా కల్పించడానికి కిషన్‌రెడ్డి పర్యటిస్తున్నారన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు రాందేవ్‌గుడ, లంగర్‌హౌస్ డిఫెన్స్ కాలనీ, అంబేడ్కర్‌నగర్ అనంతరం కార్వాన్, జియగుడలో పర్యటిస్తారన్నారు.

రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించండి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్


మంత్రి కోమటిరెడ్డితో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని మంత్రికి సమర్పించారు. శుక్రవారం మంత్రిని కలిసిన ఎమ్మెల్యే రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వివరించారు. అందుకు నిధులను కేటాయించాలని కోరారు. శంషాబాద్-షాబాద్ రహదారి విస్తరణకు రూ. 50 కోట్లు కేటాయించాల్సిన అవసరముందని మంత్రికి వివరించారు. అదే విధంగా శంషాబాద్ బస్టాప్ నుంచి ఒయాసిస్ స్కూల్ వరకు రహదారి పనులను ఆర్అండ్‌బీ, హెచ్ఎఆర్‌డీసీఎల్ రెండింటికీ టెండర్లు ఖరారు కావడంతో హెచ్ఆర్‌డీసీఎల్‌కు పనులు కేటాయించాల్సింగా కోరారు. గండిపేట్ ,శంకర్‌పల్లి రోడ్డును నాలుగు వరుసల రోడ్డును ఆరు వరసలుగా విస్తరించేందుకు రూ. 20 కోట్లు కేటాయించాలన్నారు. తాను చేసిన వినతులపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పి.శ్రీనివాస్ తెలిపారు. పీఅండ్‌టీ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు సన్‌సిటీ మెయిన్ రోడ్డు, పార్ట్ ఆఫ్ పీఅండ్‌టీ కాలనీ, ఏబీసీడీ అండ్ స్పెషల్ బ్లాక్స్, కీర్తి రిచ్‌మండ్ విల్లాస్ పరిధిలో విద్యుత్ నిలిపివేస్తామన్నారు. హైదర్షాకోట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12.20 వరకు వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రశాంత్‌నగర్, తిరుమల గార్డెన్, రాధా రిపెట్స్ ఫేస్-2, పావనీ హార్మోనీ విల్లాస్, బచ్‌పన్ స్కూల్, పార్ట్ ఆఫ్ పద్మశ్రీహిల్స్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. అలాగే భాగ్యనగర్ ఫీడర్ పరిధిలో నర్సారెడ్డి కాలనీ, పద్మశ్రీహిల్స్, భాగ్యనగర్ కాలనీ, రాధానగర్, కేకే-3, రాధానగర్ ఫేస్-1, హీరా కాలనీ, ఇంద్రారెడ్డి కాలనీ, కేకే నగర్ ఫీడర్ పరిధిలో సాయిబాలాజీనగర్, ఫీల్ గుడ్ హోమ్స్, కేకే-2,4, విఘ్నేశ్వర కాలనీ, బృందావన్ కాలనీ, గ్రీన్ ఫామ్ కాలనీ, కార్వెల్ హోమ్స్, గంధంగూడ విలేజ్, శ్రీనివాస కాలనీ, తిరుమల హిల్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఆయన వివరించారు.

గగన్ పహాడ్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో..

మైలార్‌దేవ్‌పల్లి: గగన్ పహాడ్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ రవీందర్ తెలిపారు. మెట్రో మాల్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు గోశాల, గగన్ పహాడ్ గ్రామం, పారిశ్రామిక వాడ, శాతంరాయి, పాశంబండ విద్యుత్ ఉండదన్నారు. శాతం రాయి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పారిశ్రామిక వాడ, మీనాక్షి విద్యుత్ ఫీడర్ పరిధిలో మీనాక్షి ప్రధాన రహదారి, పారిశ్రామిక వాడలలో విద్యుత్ ఉండదని వివరించారు.

రాజేంద్రనగర్ పరిధిలో..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ ఉప్పర్‌పల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం 12.30 నుంచి ఒంటి గంట వరకు ఫోర్ట్ వ్యూవ్ కాలనీ, గోల్డెన్ హైట్స్ కాలనీ, సత్యం విహార్, జన చైతన్య ఫేస్-1, 2, 3, 4 ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

జానీ మాస్టర్‌కు అవార్డు రద్దు బాధాకరం

లేడీ కొరియోగ్రాఫర్ అనీ

మణికొండ: తెలుగు చిత్ర పరిశ్రమలోని జానీ మాస్టర్‌కు జాతీయ స్థాయి అవార్డు వచ్చి అది కాస్త అతనిపై వచ్చిన ఆరోపణలకు రద్దు చేసి మరొకరికి ఇవ్వటం బాధాకరం అని స్టార్ లేడీ కొరియోగ్రాఫర్ అనీ అన్నారు. శుక్రవారం ఆమె మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్‌లోని ఎన్‌జీ డ్యాన్స్ అకాడమీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అతనిపై వచ్చిన ఆరోపణలు నిజమో కాదో తెలియదని, అతని వద్ద తనూ పనిచేశానన్నారు. మాలాంటి ఎంతో మందికి ఆయన అవకాశం కల్పించారన్నారు. అలాంటి వ్యక్తిపై ఇలాంటి ఆరోపణలు రావటం ఎంతగానో కలిచివేస్తున్నదన్నారు. ఆపదలో ఉన్న ఎంతో మంది డ్యాన్సర్లను ఆదుకున్న చరిత్ర ఆయనతో పాటు ఇతర మాస్టర్‌లకు ఉందన్నారు. యూనియన్ వాళ్లు అతనిపై వచ్చిన ఆరోపణలపై ఎందుకు మాట్లాడటం లేదో తనకు తెలియదన్నారు. పరిశ్రమకు ఇలాంటి చెడ్డపేరు రావటం బాధాకరమన్నారు. అదే అమ్మాయి జానీ మాస్టర్ గురించి ఎంతో గొప్పగా చెప్పిందని, అలాంటి ఆమె ఇలాంటి ఆరోపణలు చేయటం వెనుక కారణాలు తెలియదన్నారు. వాస్తవాలు విచారణలోనే తెలుస్తాయని ఆమె పేర్కొన్నారు.

గ్లోబల్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

సాగినావ్ వ్యాలీ యూనివర్శిటీ ప్రతినిధి డేనియల్ ఆడమ్స్


గెస్ట్ లెక్చర్‌లో పాల్గొన్న అతిథి, అధ్యాపకులు

మణికొండ: అంతర్జాతీయంగా ఉన్నత విద్య, మంచి ఉద్యోగం సాధించి రాణించాలంటే గ్లోబల్ నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతో ఉంటుందని అమెరికాలోని సాగినావ్ వ్యాలీ యూనివర్శిటీ ప్రతినిధి డేనియల్ ఆడమ్స్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధి, వట్టినాగులపల్లిలో ఉన్న శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సాయిన్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఉన్నత విద్య అవకాశాలు, ఎదురయ్యే సమస్యలపై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యాపరంగా అనేక యూనివర్శిటీలు అవకాశం కల్పిస్తున్నా ఉపాధి రంగాలలో అవకాశాలు దక్కించుకోవటం ఇబ్బందిగా మారిందన్నారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత వృద్ధి, నైపుణ్యాలు, కెరీర్ అవకాశాలు, నెట్ వర్కింగ్, సీవీ మెరుగుదల, పరిశోధన అనుభవం లాంటివి పొందాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. అలాంటివి అందించే యూనివర్శిటీలనే విద్యార్థులు ఎంచుకోవాలన్నారు. అడ్మిషన్స్, రీసెర్చ్, డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ జగదీష్, మీడియా, ప్రొటోకాల్ డీన్ డాక్టర్ బి.నరేంద్రకుమార్, డాక్టర్ యు.శ్రీలక్ష్మి, హెచ్ఓడీలు డాక్టర్ లిపికా గోయెల్, పద్మావతి, డాక్టర్ ఎం.రామసుబ్రమణియన్, ప్రొఫెసర్ డాక్టర్ సి.అంజన తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో సమయపాలన పాటించాలి

గచ్చిబౌలి: డాక్టర్లు, నర్సులు విధుల్లో సమయపాలన పాటించాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ జిల్లా ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. డాక్టర్లు, నర్సులు సకాలంలో విధులకు హాజరు కావాలని లేకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రోగులకు మందులు తప్పకుండా అందజేయాలని, మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. ఆస్పత్రిలోని ఆయా వార్డులు పరిశీలించి రోగులతో మాట్లాడారు. గైనకాలజీ, ఆర్థో, జనరల్ సర్జన్ విభాగాలపై సమీక్షించారు. ఫీవర్ కేసులు తగ్గుముఖం పట్టాయని ఆస్పత్రి డాక్టర్లు వివరించారు. అంతే కాకుండా ఆస్పత్రిలో డ్రైనేజీ సమస్య తీవ్రగా ఉందని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కమిషనర్ హామీ ఇచ్చారు. ఆస్పత్రికి సెక్యూరిటీని పెంచాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగిని రెడ్డి, డాక్టర్లు ఉన్నారు.